# సాక్షి చిత్తూరు

శనివారం । 16 । డిసెంబర్ । 2023






## శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది.



## ఇంటి ముంగిటకే 'సర్టిఫికెట్'

జగనన్న సురక్ష శిబిరాల ద్వారా అవసరమైన సర్టిఫికెట్‌లను సులువుగా మంజూరు చేయడంపై లబ్ధిదారుల ఆనందం. - 8లో



## కిక్కిరిసిన కాణిపాకం

అయ్యప్ప భక్తులతో శుక్రవారం కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. - 8లో

## న్యూస్‌రీల్

### 20న పుత్తూరులో జాబ్‌మేళా

**పుత్తూరు:** పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాను మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 25 కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన వారు మేళాకు హాజరుకావచ్చని సూచించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాకు అభ్యర్థులు సర్టిఫికెట్స్, ఐడీ ప్రూఫ్‌తో రావాలన్నారు. వివరాలకు 6300954441, 6304330520 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### పీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్ బిల్లుల అప్‌లోడ్




సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను శనివారంలోపు పీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు ఉంటే డీపీఆర్‌సీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మి, డీపీఆర్‌సీ డీసీ షణ్ముగం పాల్గొన్నారు.

### పక్కాగా గర్భిణులకు పథకాలు

**చిత్తూరు రూరల్:** గర్భిణులకు ప్రభుత్వ పథకాలు పక్కాగా అందించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రసవాలు, వైద్య సేవలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ విజయబాబు పాల్గొన్నారు.

### నేడు శ్రీనివాసుని కల్యాణం



ముస్తాబవుతున్న కల్యాణ వేదిక

**గంగవరం :** మండలకేంద్రంలో తిరుమల శ్రీవారి కల్యాణమహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సన్నద్ధమైంది. ఈ మేరు నాలుగు రోజులుగా ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసులని కల్యాణం జరిపించేందుకు వేదిక ముస్తాబవుతోంది. ఎప్పటికప్పుడు ఏర్పాట్లను ఎమ్మెల్యే వెంకటేగౌడ పర్యవేక్షిస్తున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వం సిద్ధం చేయాలని ఆదేశించారు. కట్టుదిట్టంగా భద్రత కల్పించాలని పోలీసులకు సూచించారు.

### రోగులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న డీఎస్‌ఓ జార్జ్

**ఐరాల :** పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఆదేశించారు. శుక్రవారం ఐరాల పీహెచ్‌సీ, 35 యర్లంపల్లె వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎస్‌ఓ జార్జ్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పక్కాగా వివరాలు నమోదు చేసి అన్నిరకాల ఉత్తమ సేవలందించాలని సూచించారు. క్షయ వ్యాధిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. టీబీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి టీబీ వ్యాక్సినేషన్ చేపట్టాలని ఆదేశించారు. డీపీఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, డీహెచ్‌ఈఓ గుణశేఖర్, డీపీహెచ్‌ఎన్‌ఓ రేణుకప్రభ, డీపీఓ రామ్మోహన్, పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్.. అవగాహనే ఆన్సర్



మహిళలను రొమ్ము క్యాన్సర్ వెంటాడుతోంది.. ఒకప్పుడు 45 ఏళ్లు నిండిన వారిపైనే అధికంగా ఈ మహమ్మారి దాడి చేసేంది. ఇప్పుడు యుక్త వయసులోని అతివలను సైతం భయకంపితులను చేస్తోంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలనే కబళిస్తోంది. ఈ క్రమంలో ఆడపడుచుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ అమలు చేస్తోంది. అవగాహనతోనే నివారణ సాధ్యమనే నినాదంతో సదస్సులు నిర్వహిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద క్షేత్రస్థాయిలో అనుమానితులను గుర్తిస్తోంది. ఏరియా ఆస్పత్రుల్లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తోంది. రోగులకు సకాలంలో అత్యుత్తమ చికిత్సలు అందిస్తోంది.



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

- మహమ్మారిని తొలిదశలో గుర్తించాలంటున్న వైద్యులు
- ఏరియా ఆస్పత్రుల్లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు
- జిల్లాలో 2,211 మంది బాధితులు
- మహిళలకు వరంలా ఫ్యామిలీ డాక్టర్ సేవలు

**చిత్తూరు రూరల్ :** బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. అలాగే జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ పరీక్ష కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉచితంగా పరీక్షలు, చికిత్సలు చేయిస్తోంది. త్వరలో అన్ని సీహెచ్‌సీలో సైతం స్క్రీనింగ్ టెస్ట్ సెంటర్లను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది.

**వయసుతో నిమిత్తం లేకుండా..**

గతంలో 45ఏళ్లు దాటిన వారిలోనే బ్రెస్ట్ క్యాన్సర్ కనిపించేంది. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేకుండా సోకుతోంది. పాశ్చాత్య దేశాల్ల 50 ఏళ్లు నిండి తర్వాతే పలువురు క్యాన్సర్ బారిన పడుతుండగా, మన దేశంలో 40 ఏళ్లు దాటిన వారిలో సైతం అధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఒక్కోసారి 30ఏళ్ల వారిలోనూ, కొందరు పురుషుల్లో సైతం క్యాన్సర్ బయటపడుతోంది. జిల్లాలో సుమారు 2,211 మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడినట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రొమ్ము క్యాన్సర్‌ను సెల్ఫ్ చెక్ చేసుకోవడం ద్వారా కూడా కనిపెట్టవచ్చని తెలియజేస్తున్నారు. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులువుగా ఉంటుందని వివరిస్తున్నారు. ముందుగా క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకుంటే గుర్తించడం సులభతరంగా మారుతుందని, తద్వారా నివారణకు అవకాశముంటుందని వివరిస్తున్నారు. ఎక్కువ మంది మహిళలకు దీనిపై అవగాహన లేకపోవడం వల్లే రెండు, మూడు దశల వరకు క్యాన్సర్ గుర్తించలేకపోతున్నారని చెబుతున్నారు. సకాలంలో వ్యాధిని కనిపెడితే వెంటనే చికిత్స ప్రారంభించి ప్రాణాలను కాపాడవచ్చని వెల్లడిస్తున్నారు.




**స్క్రీనింగ్ టెస్ట్‌లకు సంబంధించి ఓపీ వివరాలు**

| నెల | మొత్తం ఓపీలు | పరీక్షల సంఖ్య |
|---|---|---|
| ఆగస్టు | 625 | 89 |
| సెప్టెంబర్ | 559 | 75 |
| అక్టోబర్ | 728 | 84 |
| నవంబరు | 679 | 91 |

**'ఫ్యామిలీ డాక్టర్'తో మేలు**

గ్రామీణ ప్రాంత మహిళలకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వరంలా మారింది. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామానికే వైద్యులు వెళ్లడం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు డాక్టర్లు సైతం అందుబాటులోకి వస్తుండడంతో గ్రామీణ మహిళలు హెల్త్ చెకప్ చేయించుకుంటున్నారు. ఆయా శిబిరాల్లో మహిళలకు ప్రత్యేక పరీక్షలు చేస్తున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే మమోగ్రామ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పెద్దసంఖ్యలో మహిళలకు ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తించారు. అంతేకాదు శస్త్ర చికిత్స తర్వాత కూడా వారికి వైద్య పరీక్షలు చేస్తూ మందులు అందజేస్తున్నారు.

**సెల్ఫ్ చెక్ ఇలా**

- రుతుస్రావం వచ్చి, ఆగిన ఐదు రోజుల తర్వాత బ్రెస్ట్ చెక్ చేసుకోవాలి
- రొమ్ముపై గింజంత సైజులో కణితులు ఏమైనా వచ్చాయా, చర్మం రంగు మారిందేమో పరిశీలించుకోవాలి
- చంకల్లో గడ్డలు ఏర్పడ్డాయా అనే విషయాలను గమనించాలి
- రొమ్ము టైట్ అవుతోందా, అల్సర్స్ వచ్చాయా, చనుమొనల నుంచి రక్తం కారుతోందా వంటి అంశాలను చెక్ చేసుకోవాలి
- నొప్పిలేని కణితులను క్యాన్సర్‌గా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి.

**కారణాలు అనేకం**



మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చేందుకు అనేక కారణాలు ఉన్నాయి. లేట వయసులో పిల్లలు పుట్టిన వారు, బిడ్డకు పాలివ్వని తల్లులు, వంశపారంపర్యంగా కొందరికి, పన్నెండేళ్లోపు రజస్వల అయిన వారు, రెడ్‌మీట్ అధికంగా తినేవారు, ఎక్కువ సమయంల కూర్చుని పనిచేసేవారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఊబ కాయంతో ఉన్న మహిళలు, మెనోపాజ్ చేరే సమయంలో వచ్చే దుష్ఫలితాలకు వాడే మందులు కారణంగా ఈ మహమ్మారి బారిన పడవచ్చు. అలాగే వివాహం కాని మహిళలు,, సంతానం లేని వారు, ధూమపానం, ఆల్కాహాల్ తాగే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

– శిల్ప, స్త్రీ వైద్య నిపుణులు, చిత్తూరు

**ప్రత్యేక దృష్టి**



ఫ్యామిలీ డాక్టర్ కింద కమ్యూనికల్ డిసీజెస్‌పై ప్రత్యేకంగా దష్టి సారించాం. అందులో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి లక్షణాలున్న వారిని గుర్తించి స్క్రీనింగ్ చేస్తున్నాం. అలాగే ఆయా వ్యాధులతో చికిత్స పొందుతున్న వారిని సైతం మానిటరింగ్ చేసి మందులు అందిస్తున్నాం. రొమ్ముపై కణితులు, గడ్డలు ఉన్న మహిళలు వస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నాం. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని పరీక్షలను ఉచితంగానే చేస్తున్నాం.

– అమర్‌నాథ్, ఏసీడీ విభాగం వైద్యాధికారి, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి

## ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు

**పాలసముద్రం :** ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పాలసముద్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోందని వెల్లడించారు. అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన సలహాలు అందిస్తోందని వివరించారు. టీడీపీ హయాంలో ప్రకృతి సేద్యం పేపర్లపై మాత్రమే కనిపించేదని, వైఎస్సార్‌సీపీ పాలనలో ఉద్యమ తరహాలో ముందుకు సాగుతోందని తెలిపారు. జేసీ మాట్లాడుతూ పెట్టుబడి వ్యయం తగ్గించి రసాయన అవశేషాల్లేని పంటలను పండించే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. సేంద్రియ సాగుపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. జిల్లా వ్యవసాయ మండలి సభ్యుడు ఎస్.శివప్రకాష్ రాజు మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మామిడి పూత నుంచి కోత వరకు తీసుకోవలసిన సస్యరక్షణ విధానాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చంద్రశేఖర్‌రాజు అనే రైతు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. పశువుల పేడతో చేసిన సాంబ్రాణికడ్డీలు, గీర్ జాతి పాడి పశువులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, ఫిషరీస్ డీడీ రవికుమార్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ, ఏడీఏలు సౌభాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, శ్రీదేవి, నాగపద్మిని, డీపీఎం వాసు, ఏఓలు డిల్లీప్రసాద్, సంగీత, సృజన, కళావతి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు నెందుజలియన్, భాష్కర్ నాయక్, మధుసూదన్, వనజ, నవనీత, శంకర్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## డీఈఓ కార్యాలయంలో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరు డీఈఓ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా ప్రత్యేక బృందం శుక్రవారం రికార్డుల తనిఖీలు చేపట్టింది. ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయ ఏడీ అరుణ్‌కుమార్ బృందం డీఈఓ ఆఫీస్‌లోని అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, ఉన్నతాధికారులకు పంపిన నివేదికలను పరిశీలించింది. అటెండెన్స్, సర్వీస్ రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన విభాగం అమలు తీరుతో పాటు పలు నివేదికలను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక రిపోర్టు సిద్ధం చేసి ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డికి సమర్పించనున్నట్లు బృందం వెల్లడించింది.

## అక్కసుతోనే 'పచ్చ' విషం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**చిత్తూరు కార్పొరేషన్ :** రామోజీరావు కేవలం అక్కసుతోనే తన పత్రిక ద్వారా విషం కక్కుతున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. గురువారం ఈనాడు పత్రికలో ప్రచురితమైన 'జగన్ బర్త్‌డే బహుమతి' కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వ విధానాలపై అసత్య కథనాలు వండి వార్చడం ఎక్కువ చేశారని ఆరోపించారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైజూస్ ట్యాబ్ తీసుకువచ్చారని వెల్లడించారు. పేద విద్యార్థులను పోటీ ప్రపంచంలో దీటుగా రాణించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. అమ్మఒడి ద్వారా సంక్షేమం, నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి పచ్చ పత్రికలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎలాగైనా చంద్రబాబును అధికారంలో తీసుకురావాలనే దురాలోచనే కానీ, ప్రజా ప్రయోజనాలు వారికి అవసరం లేదని విమర్శించారు. ఎల్లోమీడియా ఎన్ని తప్పుడు వార్తలు రాసినా పట్టించుకోమని, సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ కిరణ్, స్థానిక నేత అప్పు పాల్గొన్నారు.

## అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

**చిత్తూరు కలెక్టరేట్ :** ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని డీఆర్‌ఓ రాజశేఖర్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ సత్యం, అహింస, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా, హౌసింగ్ పీడీ పద్మనాభం పాల్గొన్నారు.

## నీలిమేఘాలలో.. మంచు కెరటాలలో..!



శ్రీకాళహస్తిలో కైలాసగిరులను కమ్మేసిన మేఘాలు





తిరుమలలో దట్టమైన పొగ మంచు

తిరుపతి జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. ప్రకృతి ఆహ్లాదకరంగా మారి కనువిందు చేసింది. మధ్యాహ్నం నుంచి తుంపర్లతో ప్రారంభమైన వాన సాయంత్రానికి చిరుజల్లులుగా మారింది. తిరుమల శ్రీవారి సన్నిధితో పాటు ఘాట్‌రోడ్లను మేఘాలు కమ్మేయడంతో లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. దట్టమైన పొగమంచు కారణంగా టీటీడీ పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను తాత్కాలికంగా మూసివేసింది. శ్రీకాళహస్తిలో కైలాసగిరులపై మంచు మేఘాలు నాట్యం చేసినట్టుగా భక్తులను మైమరపించాయి. భక్తకన్నప్ప కొండపై కొలువైన శివపార్వతులు ఆకాశం నుంచే ప్రత్యక్షమయ్యారా.. అన్నట్టు పుర ప్రజలను పరవశింపజేశాయి.

– తిరుమల/శ్రీకాళహస్తి

## నలుగురు టీచర్లకు నోటీసులు

**పూతలపట్టు:** విధి నిర్వహణలో అలసత్వం వహించిన ప్రధానోపాధ్యాయుడు, ముగురు ఉపాధ్యాయులకు డీవైఈఓ చంద్రశేఖర్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం మండలంలోని పోలవరం ఉన్నత పాఠశాలను డీవైఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్టు టీచర్లు పాఠ్యాంశాలు బోధించారే కానీ, నోట్సు చెప్పలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థుల నోట్సు దిద్దని రసాయనశాస్త్రం టీచరుపై డీవైఈఓ మండిపడ్డారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు టీచర్లతోపాటు పాఠశాల హెచ్‌ఎంకు నోటీసులు జారీ చేశారు. అనంతరం తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల దృష్టి విద్యార్థులపై ఉండాలని సూచించారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.



### శ్రీవారి సేవలో దీపిక

తిరుమల శ్రీవారిని సినీనటి దీపికా పదుకోన్ శుక్రవారం సేవించుకున్నారు. అలిపిరి నడక మార్గం మార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. – తిరుమల

## క్లుప్తంగా

### వరసిద్ధుని సేవలో ప్రముఖులు



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ బబిత వేర్వేరుగా సేవించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ యాప్‌పై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ యాప్‌పై ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ప్రభుత్వం పెంచుతోందని, 18వతేదీ నుంచి ఇది అమలులోకి రానుందన్నారు. అలాగే అర్హులైన వారికి కొత్త కార్డులను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రజలకు సైతం అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సుదర్శన్ పాల్గొన్నారు.

### 17న గ్రూప్-2పై ఉచిత అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీలో ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రూప్–2 పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు జరుగుతుందని అకాడమీ కోఆర్డినేటర్ ఎం.గుణవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సదస్సుకు ముందు ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రూప్–2కు సిద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 70131 19918 సంప్రదించాలని ఆమె కోరారు.

# ఇంటి ముంగిటకే ‘సర్టిఫికెట్’

ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్‌లను సులువుగా పొందేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ‘జగనన్న సురక్ష’ ప్రారంభించింది. దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలను ఇంటి ముంగిటకే చేరుస్తోంది. పైసా ఖర్చు లేకుండా.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పనిలేకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తోంది. ఆయా సచివాలయ పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తోంది. విశిష్ట పథకం కింద ధ్రువీకరణ పత్రాలు పొందిన ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు



జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్ తీసుకుంటున్న లబ్ధిదారుడు (ఫైల్)

**గంటలో రేషన్ కార్డు**



ఉమ్మడి కుటుంబం నుంచి రేషన్ కార్డు వేరుగా తీసుకోవాలి. ఇందుకోసం దరఖాస్తు చేసుకుంటే కార్డు రావడానికి చాలా సమయం పడుతుందని చాలామంది తెలిపారు.ఈ తరుణంలో ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశపెట్టింది. వలంటీర్ మా ఇంటికే వచ్చి విషయం వివరించాడు. సురక్ష క్యాంపులో దరఖాస్తు చేసుకున్నాం. కేవలం గంట వ్యవధిలోనే రేషన్ కార్డు మంజూరు చేశారు.

– హిమబిందు, మిట్టూరు, విజయపురం మండలం

**హర్షణీయం**



గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా వందసార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా చేతులు తడపందే మంజూరు చేసేవారు కాదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కావాల్సిన అన్ని సర్టిఫికెట్లను మా ఇంటికే తీసుకువచ్చి అందిస్తున్నారు. ఎలాంటి శ్రమ లేకుండా సులువుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుండడం హర్షణీయం. ప్రజలకు ఇది ఎంతో మేలు చేకూరుస్తోంది.

– నిర్మల, కుప్పం

**మేలు మరువలేం**



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. ఎంతో మంది పాలన చేశారు. అయితే ఇంటి వద్దకే వచ్చి ఏ సర్టిఫికెట్ కావాలి అని అడిగి తెలుసుకుని, ఒక్కరోజులోనే ఉచితంగా అందిస్తోంది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే. ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తున్న సర్కారుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మాలాంటి పేదలకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న మేలు మరువలేం.

– పి. ప్రమీల, పుల్లూరు దళితవాడ, ఎస్‌ఆర్‌పురం మండలం

**ఆనందంగా ఉంది**



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో ఎంతో ఇబ్బంది పడ్డాం. సర్టిఫికెట్ లేక సంక్షేమ పథకాలు పొందలేకపోయాం. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ సర్టిఫికెట్లను మా ఇంటికే తెచ్చి ఇచ్చాడు. కుల ధ్రువీకరణ పత్రంతో వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకుని అర్హత సాధించా. ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది.

– లక్ష్మి, బంగారుపాళెం

## నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం

గంగవరం : స్థానిక సాయినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం శుక్రవారం వెలుగు చూసింది. కూలీలు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె శరీరంపై దుస్తులు లేకపోవడం, గాయాలు ఉండటంతో ఎవరో హత్య చేసి పడేసినట్టు అనుమానిస్తున్నారు. ఆధార్ కార్డు వివరాల మేరకు మృతురాలు అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లక్ష్మి(57)గా గుర్తించారు. ఆమె గత 13 ఏళ్లుగా పలమనేరు పరిసరాల్లో చెత్త బాటిళ్లు ఏరుకుంటూ గుండుబావి వద్ద గుజిరీ అంగడిలో విక్రయించుకుని జీవనం సాగించేది. గురువారం సాయంత్రం బాటిళ్లను విక్రయించి మొబైల్‌కు చార్జింగ్ పెట్టుకుని వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే రాత్రి ఎవరో ఆమెను హత్య చేసి డ్రమ్ములో పడేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అద్భుతం కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూమ్

– విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



షోరూమ్ ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

నెల్లూరు(బృందావనం): వివాహాది శుభకార్యాల్లో స్త్రీమూర్తులతోపాటు అందరూ ధరించే సనాతనమైన, నూతనమైన వస్త్రాలతో నెల్లూరులో కొత్తగా ప్రారంభించిన కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూం ఎంతో అద్భుతంగా ఉందని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య సర్కిల్‌లో కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూంను గురువారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షోరూంలోని రకరకాల వస్త్రాలు కనువిందు చేస్తున్నాయన్నారు. ప్రతి మహిళ, స్త్రీమూర్తి ఆభరణాలను, వస్త్రాలను ధరించి పరిపూర్ణంగా ఉండాలన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ బయ్యా శ్రీనివాసులు, రవికుమార్ నెల్లూరులో తొలుత న్యూరాజ్యలక్ష్మీ హాల్‌ను, ఆ తరువాత శుభమస్తు షాపింగ్ మాల్స్‌ను స్థాపించి అనంతరం నగరంలోనూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్‌ను ఆధునిక హంగులతో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద వెడ్డింగ్ మాల్ కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్‌ను నెల్లూరులో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఆ షోరూం అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ సోదరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అభిషేకానికి 109 మంది దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రక్షణ గోడను ఢీకొన్న కారు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. అనంతరం తిరుమల నుంచి కారులో మొదటి ఘాట్ రోడ్డులో కిందకు దిగుతుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది కారును పక్కకు తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

## మద్యం అనుకుని పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మద్యం అనుకుని పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలంలోని గుండేలుగుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. గుండేలుగుంటకు చెందిన చక్రపాణి(57) ముందురోజు రాత్రి మద్యం తెచ్చుకుని ఇంట్లో దాచుకున్నాడు. ఉదయమే మద్యం బాటిల్ అనుకుని దాని పక్కనే ఉన్న పురుగుల మందు బాటిల్ తీసుకెళ్లి తాగేశాడు. ఆపై కుటుంబ సభ్యులు గుర్తించి చక్రపాణిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఏనుగుల కట్టడికి ప్రత్యేక బృందం ఏర్పాటు



ఏనుగులు సంచరించే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి

పాకాల: పంటలపై వరుసగా దాడులు చేస్తున్న ఏనుగుల కట్టడికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చిత్తూరు డీఎఫ్‌ఓ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వల్లివేడు, పదిపుట్లబైలు, పేరసానిపల్లె పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఏనుగుల సంచారం పాకాల, పీలేరు, పులిచర్ల రెవెన్యూ గ్రామాల ప్రాంతాల్లో అధికంగా ఉందని చెప్పారు. ఈ టీంలో పలమనేరు ఏఆర్‌ఈ డీఎఫ్‌ఓ, చిత్తూరు ఎఫ్‌ఆర్‌ఓ థామస్ సుకుమార, వెస్ట్ ఎఫ్‌ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డి, హేమలత ఉన్నారని తెలిపారు. ఏనుగుల సంచారంపై వీరంతా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## ఉద్యోగుల ‘స్పందన’కు 7 వినతులు



అర్జీ స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక స్పందన నిర్వహించారు. వివిధ శాఖల ఉద్యోగుల నుంచి డీఆర్‌ఓ రాజశేఖర్ వినతులు స్వీకరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందనలో నమోదైన అర్జీలను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనకు మొత్తం 7 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం



భక్తులతో నిండిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం అయ్యప్ప భక్తులతో కిక్కిరిసిపోయింది. శుక్రవారం వేకువ నుంచే పెద్దసంఖ్యలో తరలి రావడంతో క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గర్భిణులు, చంటి బిడ్డల తల్లి దండ్రులు, వృద్ధులకు ప్రత్యేక క్యూ ద్వారా స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు.

## కుప్పం కళాకారుడికి సత్కారం



సన్మానం అందుకుంటున్న మణి

కుప్పం : మండలంలోని కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన శ్రీకృష్ణదేవరాయ నాటక సమాజం కళాకారుడు పీసీ మణికి ఘన సత్కారం లభించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. మణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహాభారతం, రామాయణం వంటి పౌరాణిక వీధి నాటకాలను ప్రదర్శిస్తున్న తమను కేంద్రప్రభుత్వం గుర్తించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టోర్నీకి పుత్తూరు క్రీడాకారులు



సి.జగదీష్



డి.బాలాజి



ఉదయ్‌కిరణ్



దినేష్



ఎం.హరిబాబు

పుత్తూరు: చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో ఈనెల 25వ తేదీ నుంచి జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. శుక్రవారం తిరుపతి ఎస్వీయూలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఈ మేరకు జట్టును ప్రకటించారు. మొత్తం 20 మంది సభ్యులు గల జట్టులో పుత్తూరుకు చెందిన సి.జగదీష్, డి.బాలాజీ, ఉదయ్‌కిరణ్, దినేష్, ఎం.హరిబాబు స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్ ఎం.నవీన్‌కుమార్, పీడీ సూరిబాబు అభినందించారు.

## పాల ఉత్పత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశు వైద్య విద్య సమాచార కేంద్రం, హైదరాబాద్‌కు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఏఏఆర్‌ఎం) సంయుక్త ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా మహిళలకు, నిరుద్యోగులకు పాలు, మాంసకృత్తుల ఉత్పత్తులపై జరిగిన అవగాహన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పేడు పరిసర ప్రాంతాల పెద్ద సంఖ్యలో విచ్చేసిన మహిళలకు, నిరుద్యోగులకు విలువ ఆధారిత పాలు, మాంసపు ఉత్పత్తుల తయారీపై వర్సిటీ అధికారులు, ఎన్‌ఏఏఆర్‌ఎం అధికారులు అవగాహన కల్పించారు. ఎన్‌ఏఏఆర్‌ఎం చెందిన అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, డాక్టర్ జి.వెంకటనాయుడు, డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్, కోఆర్డినేటర్, సైంటిస్ట్ డాక్టర్ సుజాత, డీన్స్ డాక్టర్ రవీంద్రారెడ్డి, జగపతిరామయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ హత్య కేసులో ఏడుగురి అరెస్ట్

తిరుమల: ఆటో డ్రైవర్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు తిరుపతి ఈస్ట్ పోలీసులు తెలిపారు. వారి కథనం.. ఈనెల 10వ తేదీ రాత్రి తిరుపతి కొత్తపల్లి చిరంజీవి రోడ్డులో చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కిశోర్(29) దారుణ హత్యకు గురయ్యాడు. పాత కక్షలే హత్యకు గల కారణమని మృతుని అక్క ఎం.ప్రమీల ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోలీసులు ఈనెల 11వ తేదీ కేసు నమోదు చేశారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈస్ట్ ఇన్‌స్పెక్టర్ డీ.మహేశ్వరరెడ్డి పలు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగి ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిలు కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన షేక్ అప్రోజ్ (21), ముప్పాళ లోకేష్ (21), నక్ల బలరామ్ (23), ఎరుకుల కాలనీకి చెందిన పెనిబేటి దేవేంద్ర(22), చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన మట్లవల్లి జనార్దన్ (21), అశోక్‌నగర్‌కు చెందిన విర్రూరి వెంకట శివకుమార్, తిరుపతి పీకే లేఔట్‌కు చెందిన హరికేశవ (25)తో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించారు. అప్రోజ్‌కు, చనిపోయిన కిశోర్‌కు మధ్య పాత కక్ష్యలు ఉన్నాయని విచారణలో తేలింది. మృతుడు కిశోర్‌పై అప్రోజ్ కక్ష పెంచుకొని తన స్నేహితులతో ముందస్తు ప్రణాళి ప్రకారం దాడి చేయాలని నిశ్చయించుకున్నారు. ముందుగా కిశోర్‌ను ఒడిసిపట్టుకోగా.. దేవేంద్ర, లోకేశ్ తమవెంట తెచ్చుకున్న కత్తులతో పొడిచి మోటార్ సైకిళ్లలో పారిపోయారు. కిశోర్ కొంతముందుకు పోయి మురికి కాలువపై గల కాంక్రీట్ రోడ్డు పై కుప్పకూలి చనిపోయాడని గుర్తించారు.

## షెడ్డుపై నుంచి జారిపడి కార్మికుడి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్ పరిధిలోని లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు పారి వెంకటేశ్వర్లు(46) శుక్రవారం ప్రమాదవశాత్తు పై నుంచి కాలుజారి మృతిచెందాడు. పోలీసుల కథనం.. ఓజిలి మండలం, పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో రోజువారి కార్మికుడు. శుక్రవారం యథావిధిగా పరిశ్రమలో సుమారు 30 అడుగుల ఎత్తులో ఉండే షెడ్డువద్ద కొంతమంది కార్మికులతో కలిసి మరమ్మతు పనులు చేస్తున్నాడు. షెడ్డు అంచున పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కార్మికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింహారావు పరిశ్రమ వద్దకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న కార్మికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలో ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లో యాజమాన్యం ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా కార్మికులతో పనులు చేయిస్తున్నందువల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం.. బీహార్‌కు చెందిన కొంతమంది పదేళ్ల క్రితం గూడూరుకు వచ్చి వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొందరు సాయిబాబా ఆలయ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పంక్చర్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఉన్న ఎండీ ఇర్షద్(26) అనే వ్యక్తి చిల్లకూరులోని మసీద్ వద్ద నమాజుకు స్కూటీపై బయలుదేరాడు. సర్వీస్ రోడ్డులో చిల్లకూరు నుంచి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఇర్షద్‌ను ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇటీవలే వివాహమైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.